
సాక్షి సిద్దిపేట

మంగళవారం । 5 । మార్చి । 2024



ఎన్నాళ్లీ గోదా'వర్రీ'

కరువు నేల హుస్నాబాద్ మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలు ఇప్పట్లో తాకేలా లేవు. రైతుల కష్టాలు తప్పేలా లేవు.

వివరాలు 8లో ▸



ఆయిల్‌పామ్ వైపు అడుగులు

ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. 25 ఏళ్లు రాబడి వచ్చే అవకాశం ఉండడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు.

వివరాలు 8లో ▸



ఉత్సాహంగా 2కే వాక్‌థాన్

అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2కే వాక్‌థాన్ నిర్వహించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రైతుల సౌలభ్యం కోసమే...

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతుల సౌలభ్యం కోసమే పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ చెప్పారు. సోమవారం చిన్నకోడూరులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో అల్లీపూర్ సొసైటీ సహకారంతో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో అత్యధిక శాతం రైతులు పొద్దుతిరుగుడు సాగు చేశారని, వారికి మార్కెట్ అందుబాటులో ఉండడం కోసమే ఈ కొనుగోలు కేంద్రం ప్రారంభించామని చెప్పారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.6,760 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్య రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం క్రాంతి, సొసైటీ చైర్మన్‌లు సదానందం గౌడ్, కనకరాజు, మార్కెట్ సెక్రటరీ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 97.87శాతం పల్స్‌పోలియో

సిద్దిపేటకమాన్: జిల్లాలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో 97.87 శాతం నమోదైనట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బంది సోమవారం 1,58,670 గృహాలను సందర్శించి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలు 93,667 మంది ఉన్నట్లు గుర్తించగా ఇప్పటి వరకు 91,675 మందికి వ్యాక్సిన్ వేసినట్లు పేర్కొన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు డీఎంహెచ్‌ఓ సూచించారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

స్టేట్ మానిటరింగ్ అధికారి ప్రమీల



వివరాలు తెలుసుకుంటున్న ప్రమీల

మద్దూరు(హుస్నాబాద్): పోలియో రహిత సమాజమే లక్ష్యమని పల్స్‌పోలియో స్టేట్ మానిటరింగ్ అధికారి ప్రమీల పేర్కొన్నారు. జిల్లా పల్స్ పోలియో అధికారి ఏసుమేరీతో కలిసి ఆమె సోమవారం పలు గ్రామాల్లో పర్యటించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ఇంటింటికీ తిరుగుతూ చిన్నారుల వివరాలు సేకరించారు. ఎంత మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారోనని సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పల్స్ పోలియోలో నిర్లక్ష్యం తగదని 0–5 సంవత్సరాలు ఉన్న ఏఒక్క చిన్నారినీ వదలకుండా పోలియో చుక్కలు వేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యధికారి సుధీర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం ఎరువులు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న శివప్రసాద్

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులకు నాసిరకం ఎరువులు విక్రయించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని రామంచ, అల్లీపూర్, చిన్నకోడూరు గ్రామాల్లోని ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రయ, విక్రయాలు రికార్డు చేయాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. యూరియా తగినంత అందుబాటులో ఉంచాలని, ఎరువుల కొరత కల్పిస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. పలు గ్రామాల్లో వరి, పొద్దుతిరుగుడు పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బయో ఉత్పత్తులను అధికంగా వాడొద్దని రైతులకు సూచించారు. పంట సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓలు రూప్సీ, ప్రవీణ్, జమీల్, రైతులు పాల్గొన్నారు.



మనిషిని తలపిస్తున్న దిష్టిబొమ్మ

టోపీ వాలా.. దిష్టిబొమ్మ ఇలా..

పొలంలో పంటను పక్షులు, పశువుల బారినుంచి కాపాడుకోవడానికి రైతులు అహర్నిశలు కష్టపడతారు. అందుకు దిష్టి బొమ్మలను ఏర్పాటు చేసుకుంటారు. మండల పరిధిలోని ధర్మారం సిద్దిపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న వరిపొలంలో రైతు వరద నారాయణ ఏర్పాటు చేసిన ఈ బొమ్మ అచ్చం టోపీ పెట్టుకుని గట్టుమీద నిలబడిన మనిషిలా కనిపిస్తూ అందరినీ ఆకర్షిస్తోంది. -మిరుదొడ్డి(దుబ్బాక)



ఎద్దు సహాయంతో చెరకురసాన్ని తయారు చేస్తున్న మహిళ

చెరకు గానుగ.. సేవిద్దాం చల్లగా

యాసంగి వేడిమి పెరుగుతోంది. ఉపశమనం కోసం పలు రకాల రసాలు, పానీయాలను తాగాలిమరి. వాటిలో చెరకు రసం అత్యంత ముఖ్యం. ఎలక్ట్రికల్ ఇంజన్‌తో చెరకు రసం తయారుచేయడం తెలిసిందే. కాని సిద్దిపేట పొన్నాల దా బాల సమీపంలో మధుసూదన్ ఎద్దు గానుగతో చెరకు రసం తీయడం ఆకర్షణగా నిలిచింది. దానిని రూ.50వేల ఖర్చుతో అహ్మదాబాద్ నుంచి తీసుకొచ్చారట.



పొంగి ప్రవహిస్తున్న చెక్‌డ్యాం

మందపల్లి.. నయాగరాలా తుళ్లిపడి..

సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మందపల్లి వాగు పొంగి ప్రవహిస్తోంది. రంగనాయకసాగర్‌కు వచ్చిచేరుతున్న నీటితో చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. దీంతో మందపల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం నుంచి నీరు ఉరుకుతూ నయాగరాను తలపిస్తోంది.

- కె.సతీశ్, సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

అడుగంటిన ఆశలు!

ఎండుతున్న పంట.. అల్లాడుతున్న అన్నదాత

- బోర్లు, బావుల్లో తగ్గిన గ్రౌండ్ వాటర్
- ట్యాంక్ ద్వారా నీటి సరఫరా
- చేతికందే దశలో నష్ట పోతున్న రైతులు
- ఆత్మహత్యలే శరణ్యం అంటూ ఆవేదన

భూగర్భజలాలు అడుగంటడంతో అన్నదాతలకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ఆధారపడిన బోరుబావులు అన్యాయం చేస్తున్నాయి. నీళ్లు లేక ఏపుగా పెరిగిన వరిపైరు కంటి ఎదుటే ఎండిపోతుంటే కాపాడుకోడానికి నానాకష్టాలు పడుతున్నారు. అయినా ఫలితం లేదంటూ ఆందోళన చెందుతున్నారు.



వాటర్ ట్యాంకర్ ద్వారా నీళ్లు పడుతున్న రైతు



బంగారులొద్దితండాలోఎండిన వరి పొలం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉమ్మడి హుస్నాబాద్ మండలాల్లో పలుచోట్ల వరిపొలాలు ఎండుతున్నాయి. వ్యవసాయ బావులు, బోర్లు అడుగంటడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని రోజుల్లో పంట చేతికి అందుతుందనగా చివరి తడులు పారించేందుకు నానాతంటాలు పడుతున్నారు. కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అక్కన్నపేట మండలం రామవరం, నందారం, బంగారులొద్దితండా, దుబ్బతండా, పంతుల్ తండా, ధర్మారం, మల్‌చెర్వుతండా, కట్కూర్, చాపగానితండా, అక్కన్నపేట గ్రామాలతో పాటు మరికొన్న గ్రామాల రైతులు బోరు బావులపైనే ఆధారపడి వరిసాగు చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే మండలంలో భూగర్భజలాలు దారుణంగా పడిపోయాయి. బోర్లమీద ఆధారపడి సాగుచేసిన పొలాల్లో ఇప్పటికే సగానికిపైగా ఎండిపోగా.. కొందరి పొలాలు పూర్తిగా ఎండిపోయాయి.

రైతుల పాట్లు..

పొలాలు ఎండిపోకుండా కాపాడేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.25వేలు నుంచి రూ.30వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. కళ్లెదుటే పంటచేలు ఎండిపోతుంటే ఖర్చుకు వెనకాడకుండా ట్యాంకర్లతో నీళ్లు పోయిస్తున్నారు. ఒక్కో ట్యాంక్‌కు రూ.1000 నుంచి రూ.1500 వరకు ఖర్చు చేస్తున్నారు. అంతే కాకుండా లక్షలు ఖర్చుచేసి బోర్లు వేయిస్తున్నారు.

ఎండిపోయిన రెండెకరాలు..



నాకున్న రెండెకరాల వరిపొలం ఎండిపోయింది. చివరి దశలో వరిని కాపాడుకునేందుకు ట్యాంక్ ద్వారా నీరు పోస్తున్న. రూ.10వేలు చెల్లించి ఓ అద్దె బావి ద్వారా ట్యాంకర్‌లో నీళ్ల నింపుకొని మడిమడికి పారిస్తున్న. ఊర్లో మెజార్టీ రైతుల పరిస్థితి ఇదే. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-గొట్టే మహేందర్, అక్కన్నపేట రైతు

ఆత్మహత్యలే శరణ్యం



రెండెకరాల్లో వరిసాగుచేస్తే ఎండిపోయింది. ఉన్న బోరుబావి ఇటీవల అడుగంటడంతో రూ.1లక్ష వెచ్చించి రెండు రోజుల కిందట బోరు వేయించినా ఫలితం లేదు. సాగుకు సుమారుగా రూ.80వేలు పెట్టుబడి పెట్టాను. చేతికి వచ్చే దశలో పూర్తిగా ఎండింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. లేకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం. -భూక్య సంపత్‌నాయక్, మల్‌చెర్వుతండా రైతు

గ్రంథాలయాలతో విషయ పరిజ్ఞానం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న గరీమా అగర్వాల్

- 13 గ్రామాల్లో ప్రారంభించాం
- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

చేర్యాల(సిద్దిపేట): యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని ముస్త్యాల, చుంచనకోట గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఏవీఎస్ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. ప్రధానంగా పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయానికి వచ్చి కథలు, విషయ పరిజ్ఞానం, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలోని పలు మండలాల్లో 18 గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు మంజూరుచేసి అందులో 13 గ్రామాల్లో ప్రారంభించినట్లు గరీమా తెలిపారు. ఎవరైనా గ్రామ పంచాయతీ తరపున ఉచిత వసతి ఏర్పాటుచేస్తే ఆయా గ్రామాల్లో కూడా గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పాఠకులకు తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలని ఆయా గ్రామాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ అలీ, పంచాయతీ ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ దివ్య, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై స్పెషల్ డ్రైవ్

సిద్దిపేటరూరల్: ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పాల్గొన్నారు. మార్చి7 నుంచి 15 వరకు గ్రామాల్లో తాగు నీటి పైపులైన్లు, వాటర్ ట్యాంకుల మరమ్మతులు చేపట్టి తాగునీటి పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు.

గౌరవెల్లికి జీఆర్‌ఎంబీ బృందం



ప్రాజెక్టును సందర్శిస్తున్న జీఆర్‌ఎంబీ బృందం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టును సోమవారం గోదావరి నది యాజమన్య బోర్డ్(జీఆర్‌ఎంబీ) చైర్మన్ డాక్టర్ ముఖేష్ కుమార్ సింహ నేతృత్వంలో వారి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు ప్రాజెక్టు కట్ట, కుడి కాలువ, పంప్ హౌజ్ వద్ద డెలివరీ సిస్టం, తూము, ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని, సీసీ కెమోరాలను పరిశీలించారు. ప్రాజెక్టు కింద ఉన్న కుడి, ఎడమ కాలువల నిర్మాణం కోసం కొంతమేరకు భూ సేకరణ చేపట్టవల్సి ఉందని బృందం దృష్టికి ఈఈ రాములునాయక్ తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ ఎస్‌ఈ శ్రీకాంత్, ఈఈ సుమతి దేవి, రాములునాయక్, డిఈ ప్రశాంత్, కర్ణశ్రీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభమయ్యేనా..

గౌరవెల్లి ప్రాజెక్టు పనులు దాదాపు 95శాతం పూర్తయ్యాయి. ఎడమ, కుడి కాలువల తూములకు షట్టర్లు బిగించారు. ప్రాజెక్టులో దాదాపు 0.05టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే పర్యావరణ అనుమతులు లేవని, పాత అనుమతులుతోనే పనులు చేస్తున్నారని పేర్కొంటూ ముంపు గుడాటిపల్లి నిర్వాసితులు జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)ను ఆశ్రయించారు. దీంతో గత సెప్టెంబర్‌లో ఎన్‌జీటీ ఆదేశాల మేరకు కట్టపై సీసీ కెమోరాలను అమర్చారు. అప్పటి నుంచి కట్ట వద్ద ఎలాంటి పనులు కొనసాగడంలేదు. ప్రస్తుతం గోదావరి నది యాజమాన్య బోర్డ్ (జీఆర్‌ఎంబీ) బృందం సందర్శించిన నేపథ్యంలో పనులు ప్రారంభమవుతాయనే ఆశలు రైతుల్లో రేకెత్తుతున్నాయి. తమ చిరకాల కోరికైన గౌరవెల్లి ప్రాజెక్టును తొందరగా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

హోర్డింగ్స్‌పై బల్దియా ఆరా

సిద్దిపేటజోన్: పట్టణంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ వల్ల ఇబ్బందులపై 2న సాక్షిలో ప్రచురితమైన 'డేంజర్ హోర్డింగ్స్' కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి తన కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, హోర్డింగ్ నిర్వాహకుల ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి అనధికారికంగా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రకటనల ద్వారా మున్సిపాలిటికి వచ్చే ఆదాయం గురించి ఆరాతీశారు. ట్రేడ్ లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

సాక్షి ఎఫెక్ట్



సమావేశంలో ప్రసన్నరాణి

సాగు నీటికోసం రైతుల ధర్నా



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

చిన్నకోడూరు(సిద్దిపేట): నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని, రంగనాయక సాగర్ జలాలు విడుదలచేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రాస్తా రోకో చేశారు. మండల పరిధిలోని మాచాపూర్, ఎల్లాయపల్లి గ్రామాల రైతులు సోమవారం మండల పరిధిలోని రామునిపట్ల వద్ద రాజీవ్‌రహదారిపై ఆందోళన చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ రంగనాయక సాగర్ ఎడమ కాలువ ద్వారా మాచాపూర్ నుంచి మేడిపల్లి వరకు వెళ్తున్న కాల్వకు మాచాపూర్ వద్ద శాశ్వత ఓటీ(తూము) ఏర్పాటు చేసి, లేదా కాలువలు తవ్వి రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని రైతులు డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా యాసంగిలో తమ పంటలు నష్టపోతున్నామని వాపోయారు. అధికారులకు ఎన్ని మార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించక పోతే తమ పంటలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. విషయం తెలుసుకున్న డీఈ రాజమల్లు, పోలీసులు అక్కడకు చేరుకుని రైతులకు నీళ్ల అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

కలెక్టర్ మనుచౌదరి

- ప్రజావాణికి అర్జీల వెల్లువ
- సారు ఓపిగ్గా వింటున్నాడు: అర్జీదారులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి వస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చాలా దూరం నుంచి వస్తారని దాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటవెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో పెట్టకుండా తీసుకుంటున్న చర్యలను గురించి వారికి తెలియజేయాలని సూచించారు. ప్రజావాణిలో తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ 42 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు. నూతనంగా కలెక్టర్ వచ్చిన తర్వాత మొదటి ప్రజావాణి కావడంతో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కలెక్టర్ తమ సమస్యలను ఓపిగ్గావిని వివరాలు అడిగితెలుసుకున్నారని చాలా మంది హర్షం వ్యక్తం చేశారు.

మా భూములు ఇప్పించండి సారు..

మాది కొమురవెల్లి మండలం, ఐనాపూర్ గ్రామం. 1999లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్ 213/ఎ లో 2–20 గుంటల భూమిని 80మంది పేద కుటుంబాలకు కేటాయించి పట్టా కూడా ఇచ్చారు. అప్పటి నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాం. ఈ క్రమంలో స్థానికంగా ఉంటున్న కొందరు టీఆర్‌ఎస్ నాయకులు మమ్మల్ని ఖాళీ చేయించి స్థలాన్ని కబ్జా చేసుకునేందుకు చూస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలి.

- ఐనాపూర్ మహిళల ఫిర్యాదు

పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు..

గజ్వేల్ ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టెక్నికల్ విద్యార్థుల ఫెడరేషన్ చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, న్యూట్రిషన్ ఫుడ్ నిధులు సకాలంలో విడుదల కావడం లేదని ఆయన పేర్కొన్నారు.

ఆ పేర్లను తొలగించాలి..

మాది జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామం. 50 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం 101 సర్వేనెంబర్‌లో 120 మందికి స్థలాలు ఇచ్చింది. 112 మంది భూమి సాగు చేసుకుంటూ ఉంటున్నప్పటికీ ధరణిలో మాత్రం 170 మంది పేర్లపై నమోదైంది. భూమిలేని వారి పేర్లు తప్పుగా నమోదయ్యాయి. అధికారులు చర్య తీసుకుని వారి పేర్లను తొలగించి, అర్హులైన వారికి కొత్త పాస్‌పుస్తకాలు అందించి రైతు బంధు అందించేలా చూడాలి.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

గజ్వేల్ : హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో 3వ తేదీన జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో గజ్వేల్‌కు చెందిన బుడోకాన్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన శ్రీజ, స్వాతి వెండి పతకాలు, నలంద పాఠశాలకు చెందిన నర్సింహ వెండి పతకం, దేవాన్ష్ కాంస్య పతకం, వర్గల్ మండల శాకారం గ్రామానికి చెందిన వంశీ బంగారు పతకాలను సాధించారు. వీరిని ఆయా పాఠశాలల యాజమాన్యాలు, కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేశ్ అభినందించారు.

వర్గల్(గజ్వేల్): రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వర్గల్ జెడ్పీహైస్కూల్ విద్యార్థి అభిలాష్ (9వ తరగతి) చక్కని ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం వర్గల్ హైస్కూల్‌లో అభిలాష్‌ను, కోచ్ వంశీని హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్ అభినందించి సన్మానించారు.

జాతీయ క్రీడలకు ఎంపిక



అనూష రవళి

చేర్యాల(సిద్దిపేట) : ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ పట్టణంలో 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా తరపున మండల పరిధిలోని ఆకునూరుకి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్ బాల్ కార్యదర్శి ఎండీ.రఫత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆకునూరుకు చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారిణి తుంగ అనూష (గోల్ కీపర్), గూడూరు రవళి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేర్గు శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

దుబ్బాక విద్యార్థుల హవా



పతకాలతో విద్యార్థులు

దుబ్బాక: ఇన్విటేషన్ నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో దుబ్బాక పట్టణ విద్యార్థులు పతకాలు సాధించినట్లు యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకుడు, స్టైల్ చీఫ్ మాస్టర్ బురానీ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. విక్టరీ షోతోకన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్యారడైస్ గార్డెన్‌లో రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీలు జరిగినట్లు తెలిపారు. ఇందులో దుబ్బాక పట్టణానికి చెందిన 21 మంది విద్యార్థులు పాల్గొని 5 గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్స్, 11 బ్రౌంజ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. పథకాలను సాధించిన విద్యార్థులను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీసీఓ ముక్తేశ్వరి అభినందించినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed (TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), BSc (నర్సింగ్), GNM. 3 నెల్లో కోర్స్ పూర్తిచేసే అవకాశం. ఫోన్: 8888977112,339. [HA-14161]

■ Single Sitting : 10th, Inter, BA, B.Com, B.Sc, BED, BPED, UGDPED, BBA, MBA, DMLT, BMLT, B.Tech, NURSING ITI, Pharmacy, LLB, Phd : 81435 83986 [L-606425]

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787736]

WANTED


■ Hydలో 7స్టార్ హోటల్స్ & మ్యారేజ్ ఫంక్షన్స్‌లో క్యాటరింగ్ బాయ్స్/గర్ల్స్ కావలెను. 8 గం. 600, 12గం. 1000, డైలీ, మంత్లీ పేమెంట్ + వసతి. & లేడీ టెలికాలర్స్ కావలెను. 7794907692 [H-787950]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233864]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎన్నాళ్లీ గోదావరీ



గౌరవెల్లి ప్రాజెక్టు

కరువు నేల హుస్నాబాద్ మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలు ఇప్పట్లో తాకేలా లేవు. ఇక్కడి రైతుల కష్టాలను తీర్చాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్లను నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టులకు రీ డిజైన్ చేసిన కొత్త ప్రభుత్వం పనులు మొదలు పెట్టి 95 శాతం పూర్తి చేసింది. అధికారులు 2023 జూలైలో ట్రయల్ రన్ చేసి నాలుగు రోజులు ప్రాజెక్టులకు గోదావరి జలాలను వదిలారు. ఇంతలోనే గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు ఉందని పనులను నిలిపేశారు. దీంతో పంటలకు నీళ్లు లేక ఎండిపోతుండడంతో రైతులు నానా కష్టాలు పడుతున్నారు.

– హుస్నాబాద్‌రూరల్

మెట్ట నేలను తాకని గోదావరి జలాలు

- గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్లు నీళ్లు లేక వెలవెల
- ఎండిపోతున్న ఆయకట్టు పంటలు
- పక్షంలో అడుగంటిన భూగర్భజలాలు
- నీళ్ల కోసం భగీరథ ప్రయత్నాలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

హుస్నాబాద్ ఉమ్మడి మండలం గుడాటిపల్లిలో ఇందిరమ్మ వరద కాల్వలకు అనుసంధానంగా నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంతో వరంగల్, జనగామ, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలోని 1.60 లక్షల ఎకరాలకు 2 పంటలకు సాగు నీరు రాబోతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంకు 3,845.17 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,487.16 ఎకరాల భూమిని సేకరించారు. మరో 40 ఎకరాల భూమి సేకరిస్తే భూ సేకరణ పూర్తి అవుతుంది. గండిపెల్లి ప్రాజెక్టులో 1 టీఎంసీ, గౌరవెల్లి ప్రాజెక్టులో 8.23 టీఎంసీల నీరును రెండు దఫాలు నింపితే 1.60 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉంటుంది. వచ్చే ఖరీఫ్ వరకు మిడ్‌మానేరు నుంచి గౌరవెల్లి ప్రాజెక్టులోకి 4 టీఎంసీల గోదావరి జలాలను తెచ్చి రైతులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ అధికారులు గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చేపట్టారు. ప్రభుత్వం మారడంతో గౌరవెల్లి ప్రాజెక్టు పనులు అక్కడే నిలిచిపోయాయి. రైతులు ఇక మనకు గోదావరి జలాలు రావని నిర్ణయానికి వచ్చి బోర్లు, బావులు తవ్వే ప్రయత్నాలు చేస్తున్నారు.



నీళ్లు లేక పగుళ్లు పట్టి వరి పొలం

భగీరథ ప్రయత్నం

వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతూ అప్పులు చేసి బోర్లు వేసుకుంటున్నారు. కొందరు రైతులు వాగులు, చెరువుల నుంచి మోటార్ల ద్వారా పంటలకు నీరు అందిస్తున్నారు. చిన్న సన్నకారు రైతులు బావులను పూడిక తీసేందుకు క్రేన్స్‌ను కిరాయిలకు తెచ్చుకొని పనులు చేసుకుంటున్నారు. గతంలో ఉపాధి హామీ పథకంలో ఊట బావుల పూడిటిక తీత పనులు ఉండేది ఇప్పుడు అవి లేకపోవడం రైతులకు అదనపు ఆర్థిక భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని కాల్వలు..



అసంపూర్తిగా ఉన్న కాల్వ

గౌరవెల్లి ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపిన తర్వాత ప్రాజెక్టు కుడి ఎడమ కాల్వల ద్వారా గొలుసు కట్టు చెరువులను నింపి చెరువుల కింది ఆయకట్టు రైతులకు సాగు నీళ్లు అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కుడి కాల్వ ద్వారా 22.79 క్యూసెక్‌లు, ఎడమ కాల్వ నుంచి 3.06 క్యూసెక్‌లు సాగు నీళ్లను చెరువులకు వదులతారని రైతులు కోటి ఆశలతో ఎదురు చూసినా అడియాసలే అయ్యాయి. కుడి కాల్వ పూర్తి అయినా ఎడమ కాల్వ పూర్తి కాలేదు. హుస్నాబాద్ డివిజన్‌లో 70 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తే నీళ్లు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు నానా కష్టాలు పడుతున్నారు.

రెండు బోర్లు వేసినా నీళ్లు రాలే..



నాలుగు ఎకరాల మిర్చి పెడితే నీళ్ల కాసే తోటను గొర్రెలకు వదిలేసిన. కళ్ల ముందు కష్టం చేసిన పంట ఎండిపోతుంటే చూడలేక 500 ఫీట్లు, ఒకటి 350 ఫీట్లు రెండు బోర్లు ఏసినా చుక్క నీళ్లు రాలేదు. 23 గజాల లోతు బాయిల నీళ్లు 15 రోజుల్లో పాతాలానికి పడిపోయిన్నాయ్. బోర్ల ఏసిన బాకీ తీర్చడానికి రెండు పాలు ఇచ్చే ఆవులను అమ్మితే అంగట్ల అగ్వకు అడుగితే రూ.60 వేలు వచ్చాయి. మిర్చి అమ్మిన తర్వాత మిగితా బాకీ కట్టి రావాలె.

– జనగామ సంపత్‌రావు, గాంధీనగర్

రైతుల బతుకులు గోదాట్ల ఏసిండ్రు



పోయిన వానా కాలంలో గౌరవెల్లి ప్రాజెక్టులకు గోదావరి నీళ్లు తేవడానికి మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ట్రయల్ రన్ చేసిండ్రు. నాలుగు రోజులు ప్రాజెక్టులకు నీళ్లు పోస్తే ఇక రైతులకు సాగు నీరు తిప్పలు లేవకున్నాం. అయిపాయే ప్రభుత్వం మారింది ప్రాజెక్టు ముచ్చటలేనే లేదు. పంటలకు నీళ్లు లేక ఎండుతుంటే ఒక నాయకుడు అడిగినోళ్ల లేకపాయే.

– రాంగోపాల్‌రావు, రైతు

సాగుకు నీళ్లు అందించాలి



కెనాల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): రైతులు సాగు చేసిన పంటలకు మల్లన్నసాగర్ కాల్వల ద్వారా నీళ్లు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని ముబారస్‌పూర్‌లో పెండింగ్‌లో ఉన్న కెనాలను భూ యజమానులతో మాట్లాడి జేసీబీతో కెనాల్‌ను తవ్వించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నీళ్లను అందించేందుకు ఇరిగేషన్ అధికారులు పెండింగ్‌లో ఉన్న కెనాల్ పనులను పూర్తి చేయాలన్నారు. పంటలు ఎండిపోకుండా మల్లన్న సాగర్ నుంచి కాల్వల ద్వారా వచ్చే నీళ్లతో చెరువులు, కుంటలు నింపి నీళ్లను అందించే మార్గాన్ని ఇరిగేషన్ అధికారులు చేపట్టాలన్నారు. అనంతరం సూరంపల్లి గ్రామంలోహెయిర్ సెలూన్ ప్రారంభించి, మాచిన్‌పల్లి గ్రామంలో మల్లన్న జాతరకు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, ముబారస్‌పూర్ ఎంపీటీసీ బోటుక తిరుపతి, బండారు దేవేందర్, మాజీ సర్పంచ్‌లు అయ్యంగారి నర్సింహులు, యాదవరెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే దౌల్తాబాద్ మండల కేంద్రంలో 8వ తేదీ నుంచి జరిగే శ్రీ స్వయంభు శంభులింగేశ్వర ఆలయ జాతరకు రావాలని ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ చైర్మన్ ఆది వేణుగోపాల్ ఆహ్వాన పత్రికను అందించారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి



కొమురవెల్లి : విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న ఎంపీపీ తలారి కీర్తన

కొమురవెల్లి(సిద్దిపేట): రాబోవు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఎంపీపీ తలారి కీర్తన అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్థిక సాయంతో మండలంలోని కొమురవెల్లి, అయినాపూర్, గురువన్నపేట, మర్రిముచ్చాల, ఉన్నత పాఠశాలలతోపాటు కస్తూర్బా గాంధీబాలికల పాఠశాలలోని 10 తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, జామెట్రీ బాక్స్, పెన్నులను అందజేశారు. 10కి పది జీపీఏ సాధించి ఉన్నత స్థాయికి ఎదగలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా అడుగు వేసి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నర్సాయపల్లి, సలాఖపూర్ గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అందించిన పరీక్ష కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగాగా మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, సత్యకళా ఆనందం, మాజీ సర్పంచ్ వంగ భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, యూత్ నాయకుడు పాకాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వంత ఖర్చులతో అందిస్తున్న పరీక్ష కిట్లను నాగపురి, పెద్దరాజుపేట, కడవేర్గు, గుర్జకుంట, వేచరేణి, తాడూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పెంబర్ల రాజశేఖర్, నాయకులు యాదగిరి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లు స్వాధీనం

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలంలోని కమాలాయపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను సోమవారం ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కమాలాయపల్లిలో కొంత మంది ఇసుకను అక్రమంగా నిల్వ చేసి అమ్ముకుంటున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఇసుక డంప్‌లను చూస్తున్న పోలీసులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట) : మండలంలోని గాగిల్లాపూర్ శివారులోని మోయతుమ్మెద వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ తగులబెట్టిన దుండగులు

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యవసాయ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని దుండగులు దహనం చేసిన ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు కూచంగారి దుర్గయ్య వివరాల ప్రకారం.. వ్యవసాయ భూమి వద్ద క్రేజ్ వీల్ నిలిపి ఉంచగా రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు టైర్లను గడ్డి వాములో వేసి తగులబెట్టినట్లు వాపోయారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం

నంగునూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఆయిల్‌పామ్ తోట దగ్ధమైన ఘటన సోమవారం మైసంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు దుర్గారెడ్డి మూడేళ్ల కిందట ఉపాధి హామీ పథకంలో 171 ఆయిల్‌పామ్ మొక్కలు నాటాడు. ఇటీవలె గెలలు వేయడంతో పంట చేతికొచ్చే దశలో ఉంది. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కింద ఉన్న గడ్డి అంటుకోవడంతో డ్రిప్పుతోపాటు చెట్లు కాలిపోయాయి. ఇది గమనించిన రైతులు మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సుద్దాల శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, రవి కాలిపోయిన మొక్కలను పరిశీలించారు.

భార్య హత్య కేసులో యావజ్జీవం



దుబ్బాకరూరల్: కిరోసిన్ పోసి నిప్పుపెట్టి భార్య చావుకు కారణమైన ఓ వ్యక్తికి జిల్లా జడ్జి జీవిత ఖైదు విధించారు. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దగుండవెల్లికి చెందిన గంట రవి తన భార్య యాదవ్వ(26)పై అనుమానంతో 2017, జూన్ 27న కొట్టి, కిరోసిన్ పోసి నిప్పంటించాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి తల్లి ఏర్పుల పోచవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సోమవారం సిద్దిపేట జిల్లా సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురామ్ యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు. విచారించిన అంజిరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ రాజమల్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజును అభినందించారు.

భార్య కాపురానికి రావడం లేదని..

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య.. దుబ్బాకలో ఘటన



అన్వేష్ (ఫైల్)

దుబ్బాక : ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాకలో సోమవారం చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణానికి చెందిన బాలె బాలె అన్వేష్ (33)కు మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన మహముదాతో వివాహమైంది. అన్వేష్ భార్యతో కలిసి దుబ్బాకలో ఉంటుండగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురైన అన్వేష్ 3 రోజులగా ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఈ క్రమంలో ఇంటి నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని శివ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలు గొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి బాల్‌రాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత

- యాప్‌తో 63 ఫోన్‌ల గుర్తింపు
- సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: కొన్ని రోజులుగా పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించి సీపీ అనురాధ బాధితులకు అప్పగించారు. తన కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలోని పలువురు కొన్ని రోజులుగా తమ సెల్‌పోన్‌లను పలు విధాలుగా పోగొట్టుకున్నారని చెప్పారు. సంబంధిత పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదుల మేరకు పోలీసులు సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేసి, బ్లాక్ చేశారు. ఆ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌లను గుర్తించి 63 మంది బాధితులకు తిరిగి అప్పగించామని చెప్పారు. జిల్లాలో 2023 ఏప్రిల్ 20 నుంచి ఇప్పటి వరకు 2100 మంది తమ సెల్‌ఫోన్‌లు పొగొట్టుకోగా సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. 657 మంది సెల్‌ఫోన్‌లు ట్రేస్‌చేయడం ద్వారా 440 సెల్‌ఫోన్‌లను రికవరీచేసి బాధితులకు అప్పగించినట్లు ఆమె తెలిపారు. మిగతావాటిని కూడా త్వరలోనే ట్రేస్‌చేసి బాధితులకు అప్పగిస్తామని సీపీ చెప్పారు. సెల్‌ఫోన్ పొగొట్టుకున్న వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ యాప్‌లో ఫోన్ వివరాలు నమోదు చేయడం ద్వారా వాటిని గుర్తించవచ్చని బాధితులకు సూచించారు. కార్యక్రమంలో ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్‌రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది శ్రీకాంత్, స్వప్న, మల్లేశం, రమేశ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ వైపు అడుగులు

- ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా మిర్చి

చిన్నకోడూరు(సిద్దిపేట): వాతావరణ పరిస్థితులు అనుకూలించక పండించిన పంటలకు దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఎప్పుడు ఒకే రకమైనవి కాకుండా మారుతున్న కాలానికనుగుణంగా దీర్ఘకాలిక పంటల సాగుకు ఒక్కొక్కరుగా అడుగులు వేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే 25 ఏళ్ల రాబడి వచ్చే అవకాశం ఉండడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. వివిధ నేలలు ఈ పంట సాగుకు అనుకూలమని గత ప్రభుత్వం గుర్తించి మొక్కల పెంపకం చేపట్టింది. ఎర్రమట్టి, నల్లరేగడి తదితర భూముల్లో దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది. నీటి వసతితోపాటు తేమశాతం అధికంగా ఉండే భూములు ఈ పంటకు అనువుగా ఉంటాయి. ఎకరాకు 50 మొక్కల వరకు నాటవచ్చు. మొక్కల మధ్యలో కూరగాయలు, మిర్చి వంటి ఆరుతడి పంటలు సాగు చేయొచ్చు.

సబ్సిడీ మొక్కలు, నిర్వహణకు సాయం..

ఆయిల్‌పామ్ ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై మొక్కలు అందజేసింది. పంటకు నీటి తడులు అందించడానికి అవసరమయ్యే డ్రిప్ కోసం ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 90 శాతం సబ్సిడీపై ఇస్తోంది. ప్రతీ ఏడాది నిర్వహణ కోసం ఎకరాకు రూ. 4,200 చొప్పున నాలుగేళ్ల వరకు అందిస్తోంది. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి మొదలై ఏటా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

3,679 ఎకరాల్లో..

సిద్దిపేట నియోజకవర్గంలో 1,132 మంది రైతులు 3,679 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. నంగునూరు మండలంలో 1,631 ఎకరాలు, చిన్నకోడూరు 727, సిద్దిపేట అర్బన్ 377, సిద్దిపేట రూరల్ 496, నారాయణరావుపేట మండలంలో 438 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగుకు ఆసక్తి ఉన్నవారి వివరాలు నమోదు చేసి శిక్షణ ఇస్తున్నారు.

మంచి ఆదాయం



ఆయిల్‌పామ్ సాగు చేస్తే నాలుగేళ్లలో పంట చేతికి వస్తుంది. ఆ తర్వాత దిగుబడి మొదలై ఎకరాకు రూ లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ పంటకు డిమాండ్ ఉంది. అడవి జంతువుల బెడద ఉండదు. సాగుకు రైతులు ముందుకు రావాలి.

– భాస్కర్ రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి